
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
17 వ వసంతంలోకి
ఆదివారం 17 మార్చ్ 2024


మెదక్


సంగారెడ్డి


సిద్దిపేట

## అనుమతులు లేకుండా
# అక్రమ మైనింగ్..!







- కనీస అనుమతులు లేకుండా చెలామణి. టీ.ఎస్.ఏ స్టోన్ ఇండస్ట్రీస్ సంస్థ.!
- రోజు రాత్రుల్లో అక్రమంగా మైనింగ్ నిర్వహణ.
- ప్రభుత్వ ఆదాయానికి కోట్లలో గండి.
- కొందరు అధికారుల తీరు వల్లే అక్రమార్కుల నిర్వాకం.

సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి.; కొందరు అవినీతి అధికారుల తీరు వల్ల ప్రభుత్వా ఆదాయానికి కొందరు అక్రమార్కులు కోట్లలో గండి కొడుతూ యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నించాల్సిన అధికారులు ముడుపుల మత్తులో జోగుతుంటే అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. పటాన్ చెరు మండలం లక్డారం గ్రామ పరిధిలో నిర్వహింపబడుతున్న శ్రీలక్ష్మి సంస్థ యాజమాన్యం ఆ సంస్థ గడువు ముగియగానే రెన్యువల్ చేసుకోవాల్సింది.కానీ ఆ సంస్థ యాజమాన్యం తమ సంస్థ పేరును టి.ఎన్.ఏ స్టోన్ ఇండస్ట్రీస్ సంస్థగా పేరు మార్చుకోవడానికి సంబంధిత శాఖలో అర్జీ పెట్టుకున్నారు.అయితే పరిశీలించిన సంబంధిత శాఖ ఆ సంస్థ పేరును టీఎస్ఏ స్టోన్ ఇండస్ట్రీస్ సంస్థగా పేరు మార్చి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది.అయితే ఈ సంస్థకు ఈ.సీ,సి.ఎఫ్.ఈ,సి.ఎఫ్.ఓ అనుమతులు తీసుకోవాల్సింది.

వివరాలు 2లో

## కవిత అరెస్ట్ పై..
# వెల్లువెత్తిన నిరసనలు

- కవిత అరెస్ట్ పై వెల్లువెత్తిన నిరసనలు.
- మోడీ కి కెసిఆర్ తలొగ్గలేదనే ఇలాంటి అక్రమ కేసులు.



వివరాలు 2లో

## అభివృద్ధికి కేరాఫ్....
# దామోదరుడు

- జోగిపేటకు ఆసుపత్రికి రూ.60 కోట్లు
- ఉత్తర్వులు జారీ సంబరాలు జరుపుకున్న శ్రేణులు



వివరాలు 2లో

## అమలులోకి వచ్చిన...
# ఎన్నికల కోడ్



సంగారెడ్డి మేజర్ న్యూస్ ప్రతినిధి : కేంద్ర ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.

అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్ చంద్రశేఖర్, మాధురి, జిల్లా ఎస్పీ రూపేష్ లతో కలిసి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఎన్నికల నిబంధనలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శనివారం నుండి ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయన్నారు అన్ని పార్టీల నాయకులు అభ్యర్థులు తప్పనిసరి ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల ప్రచారానికి, సభలు సమావేశాల నిర్వహణకు ఎన్నికల కమిషన్ రూపొందించిన సువిధ ఆప్ లో అనుమతులు తీసుకోవాలన్నారు.శనివారం నుండి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సుమారు రెండున్నర నెలలపాటు ఎన్నికల కోడ్ జిల్లాలో అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికలకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఏప్రిల్ 18 న వెలువడనున్నట్లు తెలిపారు . ఏప్రిల్ 18 నుండి 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు 26వ తేదీన స్క్రూటినీ నిర్వహించనున్నట్లు, 29 వరకు విత్డ్రాయిలకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. మే 13వ తేదీన పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

వివరాలు 2లో

- ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే :
జిల్లా ఎన్నికల అధికారి / కలెక్టర్ క్రాంతి వల్లూరు
శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు:
రూపేష్, జిల్లా పోలీస్ సూపరిండెంట్.
- ఏప్రిల్ 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల.
- నామినేషన్ దాఖలకు చివరి తేదీ ఏప్రిల్ 25.
నామినేషన్ల స్క్రూటీని ఏప్రిల్ 26.
- నామినేషన విరమణకు చివరి తేదీ ఏప్రిల్ 29.
మే 13న పోలింగ్..
- ప్రతి ఒక్క ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల కోసం 24 గంటలు 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు
- సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మీడియా సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పి

# బిజెపితోనే దేశాభివృద్ధి సాధ్యం

జహీరాబాద్ ఎంపీ బీ బీ పాటిల్...

బీబీ పాటిల్ సమక్షంలో బిజెపిలో చేరిన పలువురు తాజా మాజీ సర్పంచ్ లు..



పెద్ద శంకరంపేట్ మేజర్ న్యూస్ : భారతీయ జనతా పార్టీతోనే సుస్థిర దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జహీరాబాద్ బిజెపి పార్లమెంట్ అభ్యర్థి.. ఎంపీ బీబీ పాటిల్ అన్నారు.. శనివారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో పెద్ద శంకరంపేట మండలం బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొట్టిముక్కుల.. మూడ్ చెట్ పల్లి.. లక్ష్మాపూర్ ఇసుకపాయల తాండ.. కట్టెల వెంకటాపూర్ గ్రామాలకు చెందిన తాజా మాజీ సర్పంచులు .. పలువురు నాయకులు ఉదయశ్రీ సూర్యప్రకాష్.. రమ్య అశోక్.. కవిత రమేష్.. వడితే సుభాష్.. భాను.. కొత్తపేట తాజా మాజీ ఉపసర్పంచ్ శ్రీశైలం.. గొట్టిముక్కుల మాజీ సర్పంచ్ రుద్ర గంగారాం.. మూర్చేపల్లి మాజీ ఎంపిటిసి నర్సింలు తో పాటు పలువురు నాయకులు బిజెపిలో చేరారు.. ఈ సందర్భంగా ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 400కు పైగా పార్లమెంట్ స్థానాలను గెలుచుకొని కేంద్రంలో సుస్థిర ప్రభుత్వ ఏర్పాటు చేయడం ఖాయమన్నారు.. యువకులు మహిళలు.. అధిక సంఖ్యలో ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని వచ్చే ఎన్నికల్లో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లో బిజెపి గెలవడం ఖాయం అన్నారు.. గ్రామాలలో బూత్ స్థాయి వరకు కార్యకర్తలు నాయకులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరిస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కోణం విట్టల్ .. పత్రీ రామకృష్ణ పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్..!

మొదటిపేజీ తరువాయి...

కానీ అ సంస్థ అనుమతులు తీసుకోలేదు.ఈమధ్య రాష్ట్రంలో ప్రభుత్వం మారడం వల్ల ఇక్కడి మైనింగ్ సంస్థల అక్రమాలపై దృష్టి సారించిన అధికారులు ఉన్నతాధికారుల బృందంతో టాస్క్ ఫోర్స్ కమిటీని ఏర్పాటుచేసి ఇక్కడి క్రషర్ల,క్వారీలలో జరుగుతున్న అక్రమాలపై విచారణకు ఆదేశించింది.ఇందులో భాగంగా విచారించిన అధికారులు కొన్ని క్రషర్ల.క్వారీల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా కనీసం అనుమతులు లేకుండా మరికొన్ని క్రషర్ల యాజమాన్యాలు ప్రభుత్వ భూములను తమకు కేటాయించిన పరిధికి మించి మైనింగ్ చేస్తున్నాయని గుర్తించి వాటిపై మూసివేత ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా టి.ఎస్.ఏ స్టోన్ ఇండస్ట్రీస్ సంస్థ కనీస అనుమతులు లేకుండా కాలుష్య నియంత్రణ శాఖ నిబంధనలకు విరుద్ధంగా రాత్రికి రాత్రి నిర్వహించబడుతూ ప్రభుత్వానికి రావలసిన ఆదాయంలో కోట్ల రూపాయలు గండికొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారు.ఇంత జరుగుతున్నా మైనింగ్ శాఖ అధికారులు కాలుష్య నియంత్రణ శాఖ అధికారులు దృష్టి ఇటువైపు పడకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. రాయల్టీ చెల్లించకుండానే ఇదే జాతీయ రహదారిపై ఈ సమస్యకు చెందిన వాహనాలు నడుస్తుంటే అధికారులు కళ్ళు మూసుకోవడంలో మర్మం ఏమిటో అర్థం కాదు ఇక్కడి మైనింగ్ బాగోతంపై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉన్నా కొందరు అధికారులు స్వలాభపేక్షతో అక్రమార్కులకు ఉచిత సలహాలు ఇస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నీరు కార్చేలా చేస్తుంటే మిగతా అధికారులు చొరవ చూపి అవినీతి అధికారుల బాగోతం సంబంధిత శాఖలో ఉన్నతాధికారులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతో ఉంది. మైనింగ్,కాలుష్య నియంత్రణ శాఖ లోనే కొందరు అధికారులు తీరు అనుమానాస్పదం. టి.ఎస్.ఏ స్టోన్ ఇండస్ట్రీస్ సంస్థ బాగోతంపై మైనింగ్ ఏడి కాలుష్య నియంత్రణ శాఖ ఈ.ఈ అదికారులకు మేజర్ న్యూస్ వివరణ నిమిత్తం పలుమార్లు ఫోన్లో సంప్రదించినా సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడం చూస్తుంటే ఈ అధికారులకు అక్రమ మైనింగ్ వ్యాపారులపై ఉన్న ప్రేమ.పాషాలు ఇట్టే అర్థమవుతాయి. లక్డారం గ్రామస్తులు పలు సందర్భాల్లో ఈ అధికారులను పలుమార్లు నిలదీసిన సంఘటనలు ఉన్నాయి. ఏదైనా సమస్యపై సంబంధిత శాఖలో ఫిర్యాదు చేద్దామని అ గ్రామస్తులు సమాచారం ఇవ్వడానికి ఈ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించరు అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ శాఖల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే అక్రమాలకు అవకాశం ఉండదు. ముడుపులకు తలొగ్గి అక్రమార్కులకు వంత పాడుతున్న ఈ అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది అంటూ స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి అక్రమార్కులపై కొరడా ఝులిపించాల్సిన అవసరం ఉంది..!

# అభివృద్ధికి కేరాఫ్.... దామోదరుడు

- జోగిపేటకు ఆసుపత్రికి రూ.60 కోట్లు
- ఉత్తర్వులు జారీ ... సంబరాలు జరుపుకున్న శ్రేణులు



అండోల్ మేజర్ న్యూస్ : అభివృద్ధి కేరఫ్ దామోదర అని చెప్పవచ్చు. తన మార్క్ తో అభివృద్ధి పనులను చేపట్టడమే లక్ష్యంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ తనదైన శైలిలో పనితీరు మొదలైంది. గతంలో ఆయన ఏ శాఖ మంత్రిగా ఉన్న ఆ శాఖకు సంబంధించిన పనులను చేపట్టి నియోజకవర్గంలో తనదైన ముద్రను చాటుకున్నారు. గెలిచిన మూడు నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయలను మంజూరు చే యించి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. దామోదరా...మజాకా అంటూ రాజకీయ పార్టీల నాయకుల్లో చర్చ కొనసాగుతున్నది. జోగిపేట ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఇటీవల రూ.138.11 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు...మొన్న వట్‌పల్లి కేంద్రంలో రూ.11.20 కోట్లతో 30 పడకల ప్రభుత్వాసుపత్రి... నేడు అందోలు?జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.60 కోట్లతో 150 పడకల మల్టిస్పెషాలిటీ ఆసుపత్రి...ఇలా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ. శనివారం అందోలు?జోగిపేట మున్సిపల్ పరిధిలోని 100 పడకల ఏరియా ఆసుపత్రికి రూ.45 కోట్లు, 50 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రానికి రూ.15 కోట్లకు సంబంధించి మొత్తం రూ.60 కోట్లను మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. అంతేకాకుండా గత రెండు రోజుల క్రితం రేగోడు మండలం లింగంపల్లి వద్దనున్న బోరంచ ఎత్తి పోథల పథకం పునరుద్ధరణకు రూ.4.21 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చేపట్టడమే లక్ష్యంగా దామోదర్ రాజనర్సింహ పనితీరు కనిపిస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల వ్యవధిలోనే అటు ఆరు గ్యారంటీల పథకాల అమలుతో పాటు నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయాలను అభివృద్ధి పనులకు మంజూరు చేయించారు. దామోదర్ రాజనర్సింహ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన వాగ్దానాలను నేరవేర్చేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నారనడంలో ఏలాంటి సందేహం లేదు. ?ఆసుపత్రులు రాకతో మున్సిపాలిటీకి ప్రత్యేక గుర్తింపు: అందోలు?జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆసుపత్రులు మంజూరు కావడంతో ప్రత్యేక గుర్తింపు రానుంది. ప్రస్తుతం ఉన్న ఏరియా ఆసుపత్రితో పాటు 100 పడకల ఏరియా ఆసుపత్రి, 50 పడకల మాతా శిశు సంరక్షణ కేంద్రం మంజూరుతో మంజూరుతో అన్ని రకాల మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న నమ్మకం ప్రజల్లో పెరగనుంది. గతంలో ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే జోగిపేట ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి సంగారెడ్డి, హైదరాబాద్ పట్టణాలకు రెఫర్ చేసేవారు. ఈ ఆసుపత్రుల మంజూరుతో రాబోవు రోజుల్లో అలాంటి సమస్యలు ఉండవన్న భరోసా ప్రజల్లో పెరిగింది. ఆసుపత్రుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందోలు గుట్టవద్ద జాతీయ రహదారి పక్కన పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో సుమారుగా 12 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. ఈ స్థలంలో ఈ ఆసుపత్రులతో పాటు నర్సింగ్ మెడికల్ కళాశాల, వసతి గృహాల నిర్మాణం కోసం స్థలాన్ని కూడా గుర్తించినట్లు ఆ పార్టీకి చెందిన నాయకులు చెబుతున్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు, ప్రజలు:**

అందోలు?జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని రూ.60 కోట్లతో 150 పడకల ఆసుపత్రులను మంత్రి దామోదర్ రాజనర్సింహ మంజూరు చేయడం పట్ల మున్సిపల్ కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, రంగ సురేష్, ఆకుల చిట్టిబాబు, పి.రేఖా ప్రవీణ్, డాకూరి శంకర్, కే.నాగరాజు(నాని), హరికృష్ణాగౌడ్, దుర్గేష్, చందర్ నాయక్‌లతో పాటు పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోరకు గెలిచిన మూడు నెలల కాలంలో వందల కోట్ల రూపాయాలను కేటాయించారన్నారు. గతంలో దామోదర్ మంత్రిగా ఉన్న సమయంలోనే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయాని వారు గుర్తు చేశారు. ఎన్నికల్లో దామోదర్ ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ నేరవేరుస్తానడంలో ఏలాంటి సందేహం లేదన్నారు. రాబోవు రోజుల్లోనూ అందోలు నియోకవర్గంలో రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా మారుతుందని, దామోదర్‌పై అంతటి నమ్మకం, భరోసా ఇక్కడి ప్రాంత ప్రజల్లో ఉందని వారు కొనియాడారు.

# అమలులోకి వచ్చిన... ఎన్నికల కోడ్

మొదటిపేజీ తరువాయి...

సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ ,అందోల్ , జహీరాబాద్ , సంగారెడ్డి ,పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధి లో ఓటర్లు మహిళలు ,పురుషులు 14,18,688, మంది ఓటర్లు, ట్రాన్స్ జెండర్స్ 139, సర్వీస్ ఓటర్లు 353 మంది ఓటర్లు ఉన్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని తెలిపారు.జూన్ ఆరవ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే వివిధ పార్టీల అభ్యర్థులు నాయకులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సహాయ ఎన్నికల అధికారులుగా ఆయా రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులను ఎన్నికల సంఘం నియమించినట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్కు ముందే ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరువాలన్నారు. ఎన్నికల ఖర్చులన్నీ ఆ బ్యాంకు ఖాతా నుండి ఖర్చు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం సూచించిన రికార్డులను మెయింటైన్ చేయాలని ప్రతి వారం ఎన్నికలకు సంబంధించిన ఖర్చు వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలన్నారు ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చు వివరాలను ప్రత్యేక షాడో టీం లను ఏర్పాటు చేసి వీడియో రికార్డులు చేసి ఎన్నికల అధికారులు రికార్డు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చు 95 లక్షల వరకు పరిమితివిధించిందని తెలిపారు.అభ్యర్థి, అధికారులు నమోదు చేసే రికార్డులు రెండిటినీ సరిచూడన ఉన్నట్లు తెలిపారు. సభలు సమావేశాలకు తప్పనిసరి సువిధ యాప్ లో దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలన్నారు సభలో ఒక సమావేశాలకు పోలీస్ శాఖ అధికారులు ఇచ్చే ఎన్వోసీ తప్పనిసరి అన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకే పత్రికా ప్రకటనలు వీడియో టెలికాస్టింగ్ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని పార్టీల నాయకులు సహకరించాలన్నారు సి విజిల్ యాప్ ద్వారా ఎన్నికలలో ప్రలోభాలకు పాల్పడి రాజకీయ నాయకులు పార్టీల వివరాలను సామాన్య ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే అభ్యర్థులకు అనర్హత వేటుపడే అవకాశం ఉందన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రూపేష్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పోలీస్ సూపర్డెంట్ రూపేష్ తెలిపారు. నిబంధనల మేరకు 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని సూచించారు . ఎక్కువ డబ్బు తీసుకెళ్లేవారు ఆ డబ్బుకు సంబంధించిన ప్రతి వివరాలు దగ్గర ఉంచుకోవాలన్నారు సాధ్యమైనంతవరకు నిర్ణీత మొత్తం డబ్బు తీసుకెళ్లే ప్రయత్నం చేయాలన్నారు. ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దని, కులాలు మతాల పేరిట ప్రజలను విడగొట్టి రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు అన్నారు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ఎందుకు అన్ని వర్గాల ప్రజలు రాజకీయ నాయకులు సహకరించాలన్నారు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు సభలు సమావేశాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

# ప్రత్యేక అధికారి పాలన తీరుపై

## మండిపడుతున్న ఎంపిటిసి సుతారి నర్సింలు

- గ్రామాలలో పడకేస్తున్న పారిశుధ్యం.
- చెత్త చెదారం తో నిండి పోతున్న బజార్లు.
- రాత్రి పూట దోమల బెడద తో జంకుతున్న ప్రజలు.





మిరుదొడ్డి,మేజర్ న్యూస్ : సర్పంచు పదవీ కాలం ముగియడంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి గ్రామానికి ప్రభుత్వ ప్రత్యేక అధికారిని నియమినీచినప్పటికి ఆయన పర్యవేక్షణా లోపం వల్ల మండల కేంద్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడవలసిన దుస్థితి దాపురించిందని ఎంపిటిసి సుతారి నర్సింలు మండిపడ్డారు. శుక్రవారం రోజున పలువురు గ్రామస్థులతో కలిసి గ్రామంలో కలియ తిరుగుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పై ఆరా తీశారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ చూసినా చెత్త చెదారం తో నిండి పోతున్న బజార్లు, రోడ్లు దర్శనమిస్తున్నాయని తెలిపారు. మురికి కాలువలు నిండి పోవడం వల్ల దోమలు స్వైర విహారం చేస్తూ భయానక వాతావరణం కల్పిస్తున్నాయని అన్నారు.రాత్రి అయితే చాలు దోమల బెడదతో ప్రజలు జంకుతున్నారని అవేదన వ్యక్తం చేశారు.దోమ కాటు వల్ల అనేక రోగాల బారిన పడవలసిన దుస్థితి నెలకొందని చెప్పారు.చీకటి సమయంలో వీది లైట్లు వెలుగక చీకటిలోనే మగ్గిపోవలసిన దుస్థితి దాపురించిందని తెలిపారు.

అధికారులకు సమస్యలపై ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదంటూ అగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రజలు ఎదుకుంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేని యెడల కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని అన్నారు.

# పది పరీక్షలకు సర్వం సిద్ధం



అక్బర్ పేట / భూనీపల్లి, మేజర్ న్యూస్ : పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 02 వరకు ప్రతిరోజు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహించబడుతాయని మండల విద్యాధికారి ప్రభుదాస్ శనివారం రోజున విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు.విద్యుత్తు బల్బులు టాయిలెట్లు మూత్రశాలలు త్రాగునీరు వైద్య సదుపాయం మరియు బందోబస్తు తో సహా అన్ని వసతులను సమకూర్చడం జరిగిందన్నారు. మండలంలో రెండుపరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిపత్ ఉన్నత పాఠశాల భూంపల్లి నందు 99 మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పోతారెడ్డి పేట నందు 107 మంది మొత్తం 206 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నారని చెప్పారు.ఇందుకు గాను ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు ఇద్దరు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు 14 మంది ఇన్విజిలేటర్లు ఇద్దరూ సహాయకులను నియామకం చేయడం జరిగింది.

# పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



మిరుదొడ్డి,మేజర్ న్యూస్ : పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ప్రతిరోజు ఉదయం 9:30 గు నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహించబడుతాయని మండల విద్యాధికారి ప్రభుదాస్ శనివారం రోజున మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు.విద్యుత్తు బల్బులు టాయిలెట్లు మూత్రశాలలు త్రాగునీరు వైద్య సదుపాయం మరియు బందోబస్తు తో సహా అన్ని వసతులను సమకూర్చడం జరిగిందన్నారు.మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మిర్దొడ్డి నందు 234 మంది టి ఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ అల్వాల నందు 135 మంది మొత్తం 369 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని అన్నారు.ఇందుకు గాను ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు ఇద్దరు డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు 19 మంది ఇన్విజిలేటర్లు నలుగురు సహాయకులను నియామకం చేయడం జరిగిందన్నారు.

# కవిత అరెస్ట్ పై వెల్లువెత్తిన నిరసనలు

- కవిత అరెస్ట్ పై వెల్లువెత్తిన నిరసనలు.
- మోడీ కి కెసిఆర్ తలొగ్గలేదనే ఇలాంటి అక్రమ కేసులు.
- సుప్రీం కోర్ట్ లో విచారణ లో ఉన్న ఈ అరెస్ట్ చేయడం రాజకీయ కుట్ర.
- బీజేపీ కాంగ్రెస్ ఒక్కటై బి ఆర్ ఎస్ పై.. కెసిఆర్ పై కుట్రలు చేస్తున్నారు.
- సిద్దిపేట లో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ కు నిరసనగా బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ధర్నా.





సిద్దిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్ : కవిత అరెస్టు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అక్రమ అరెస్ట్ అని బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు లు మండిపడ్డారు.. అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తూ సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తా లో బి ఆర్ ఎస్ పార్టీ పిలుపు మేరకు శనివారం రోజున ధర్నా నిర్వహించారు... భారీ బి ఆర్ ఎస్ శ్రేణులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి, మోడీ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు... ఈ సందర్బంగా జిల్లా పరిషత్ చైర్మన్ రోజా రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ కవిత అరెస్టు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని,బిజెపిలో చేరితే అన్ని కేసులు మాయమవుతాయి బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడితే లేని కేసులు నమోదవుతాయని వారు మండిపడ్డారు... ఇడి, సిబిఐ కేసులున్న కరుడుగట్టిన నేరస్తులెందరినో బిజెపి ప్రభుత్వం వదిలేసింది. కేసులున్న వారు, మర్డర్ కేసులున్న వారు బిజెపి ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారన్నారు... ఏ నేరం నిరూపణ కాకున్నా సరే, కవితను అరెస్టు చేశారని, విచారణకు కవిత అన్ని విధాలా సహకరించారు. ఫోన్లు ఇవ్వమన్నా ఇచ్చి వచ్చారని చెప్పారు. ఓవైపు కవిత పిటిషన్ సుప్రీం విచారణలో ఉందనీ, అందులో ఏ నిర్ణయమూ ఇంకా వెలువడలేదు అయినా సరే, అరెస్టు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంలో మోది అన్ని హద్దులు చెరిపేశారన్నారు.. పార్లమెంటు ఎన్నికల ముందు కవితను అరెస్టు చేయడం ద్వారా బిఆర్ఎస్ కార్యకర్తల ఆత్మస్థయిర్యం దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు.నోటిఫికేషన్ ఇచ్చే ఒకరోజు ముందు అరెస్టు చేయడంలో ఆంతర్యం ఏమిటని వారు కేంద్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు..కవితను అరెస్టు చేయాలని రాష్ట్ర బిజెపి నాయకులు చేసిన డిమాండ్ కు ఇడి స్పందించడం ఏమిటి?.. ఇడి, సిబిఐలను బిజెపి నడుపుతుందా? అవి స్వతంత్ర సంస్థలా? అని ఏద్దేవా చేశారు... బి ఆర్ ఎస్ పార్టీ కి అరెస్ట్ లు ఉద్యమాలు కొత్త కాదు అని, మాది పోరాడే గుణం ఉన్న పార్టీ. ఇలాంటి బెదిరింపులకు భయపడమని స్పష్టం చేశారు.. న్యాయ పరంగా పోరాటం చేస్తాం. ప్రజల తరుఫున మా పార్టీ పోరాటం కొనసాగుతుందన్నారు. నరేంద్రమోది, రేవంత్ రెడ్డి కలిసి ఈ కుట్ర చేశారని అన్నారు.బిజెపి, కాంగ్రెస్ ఒక్కటై బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారనిన్నారు. ఒకరి కుట్రకు మరొకరు సహకరిస్తున్నారన్నారు... ఈ కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు,పట్టణ అధ్యక్షులు సంపత్ రెడ్డి, సీనియర్ నాయకులు పాల సాయి రానీ, మచ్చ వేణుగోపాల్ రెడ్డి,వంగ నాగిరెడ్డి , అయా మండలాల ఎంపిటిసిలు, జడ్పీటీసీలు,మండల పార్టీ అధ్యక్షులు,నియోజకవర్గ బి ఆర్ పార్టీ ప్రజాప్రతినిధులు, విద్యార్థి యువజన మహిళా ఇతర అనుబంధ సంఘాల అధ్యక్షులు కమిటీ సభ్యులు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



నారాయణఖేడ్ సూర్య మేజర్ న్యూస్ : నారాయణఖేడ్ నియోజకవర్గం మండలంలోని మిత్య నాయక్ తండా తుర్కపల్లి తండా వెంకటాపుర్ గ్రామాలలో శనివారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సీసీ రోడ్డుల సుమారు 4 నుండి 5 లక్షల విలువ గలా అంచనా పనులను ప్రారంభించిన ఖేడ్ శాసన సభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ్ రెడ్డి ఈ కార్యక్రమలలో మండల నాయకులు మాజీ ఎంపీటీసీ పండరీ రెడ్డి ఎంపీపీ తనయుడు రమేష్ చౌహాన్ మాజీ ఎంపీటీసీ దత్తు శివ గ్రామ నాయకులు మరియు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి
- అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు
- నగదు జప్తు చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి
- ప్రతి రాజకీయ పార్టీ సభలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఒక వ్యయాన్ని నమోదు చేయాలి
- ఎన్నికల వ్యయ వివరాలు నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘన లపై సమీక్షించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

**: కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్**



మెదక్ మేజర్ న్యూస్ ప్రతినిధి ; రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘన పై తీసుకోవాల్సిన చర్యలపై ఏ ఆర్ ఓ లు ఏ ఈ ఆర్ వో లు ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, లతో సమీక్షించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ మాట్లాడుతూ, రాబోయే పార్లమెంట్ ఎన్నికలను భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు.పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రజా ప్రాతినిధ్యం చట్టంలోని సెక్షన్ 28 ప్రకారం మనమంతా భారత ఎన్నికల కమిషన్ పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని, మనం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని, మన పారదర్శకత ప్రతి అంశంలో స్పష్టంగా కనిపించాలని , ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొన కూడదని స్పష్టం చేశారు.పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటుచేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీను గుర్తించడం, రిపోర్ట్ చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, సి-విజల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నెంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.విధుల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వలెన్స్ బృందాలు నగదు ,ఇతర ఆభరణాలు సీజ్ చేసినప్పుడు తప్పనిసరిగా వీడియో ఫుటేజ్ తీసుకోవాలని, ఏ మాత్రం నిర్లక్షం ప్రదర్శించ వద్దని సూచించారు



ఎన్నికలకు సంబంధించి అక్రమ నగదు, మద్యం పంపిణీ అరికట్టడమే మన లక్ష్యమని, సాధారణ ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీలైనంత వరకు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పకుండా పాటించాలని, నగదు సీజ్ చేసే సమయంలో ఎక్కడ అప్పీల్ చేయాలనే అంశం స్పష్టంగా తెలియజేస్తూ రశీదు అందించాలని అన్నారు. వీడియో సర్వేలెన్సు బృందాలు ,వీడియో వ్యూయింగ్ బృందాలు, అకౌంటింగ్ బృందాలు ఎన్నికల నేపథ్యంలో జరిగే ప్రతి రాజకీయ సభలు, ర్యాలీలను క్షుణ్ణంగా పరిశీలించాలని, వినియోగించిన వాహనాలు, కుర్చీలు, స్టేజి, సౌండ్ ఏర్పాట్లు , భోజనం తదితర ప్రతి అంశాన్ని పరిశీలించి వివరాలు నమోదు, రికార్డ్ చేయాలని అన్నారు.అక్రమ నగదు, మద్యం పంపిణీ జరగకుండా జాగ్రత్తలు వహించాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అప్రమత్తంగా ఉంటూ ఆధారాలు సేకరించాలని సూచించారు

అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తరువాత ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎట్టి పరిస్థితుల్లోని ఎన్నికల విధుల్లో అలసత్వం వహించ రాదని ఎన్నికల విధులు నిర్వహించే అధికారుల వారి చేపట్టే విధుల వివరాలు గురించి తెలియజేశారు మెదక్ ఏ ఆర్ ఓ గా ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఏ ఆర్ ఓ గా, జగదీశ్వర్ రెడ్డి ఆర్డిఓ , ఈవీఎం మేనేజ్మెంట్ మోడల్ ఆఫీసర్గా అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్. ( ఎంసిసి ) నోడల్ ఆఫీసర్గా జడ్పీ సీఈఓ సిహెచ్ ఎల్లయ్య, ట్రాన్స్ పోర్ట్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్గా జిల్లా రెవెన్యూ అధికారి పద్మశ్రీని నియమించారు, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్గా తూప్రాన్ ఆర్డీవో ఎం జై చంద్రారెడ్డి, బ్యాలెట్ పేపర్ పోస్టర్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్గా సిహెచ్, శ్రీనివాసరావు, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ ఆఫీసర్ గా డిఎం సివిల్ సప్లై హరికృష్ణ ఉంటారని, శాంతి భద్రతల పరిరక్షణ నోడల్ ఆఫీసర్ గాఅడిషనల్ ఎస్పీ మెదక్ ఎస్.మహేందర్,మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ గా జిల్లా విద్యాశాఖ అధికారి డి రాధా కిషన్, మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ గా

డి గోపాల్ డి ఎస్. సి డి ఓసైబర్ సెక్యూరిటీ అండ్, ఐ.టి నోడల్ ఆఫీసర్గా ఏడి మత్స్య శాఖ అధికారి నరసింహారావు వ్యవహరిస్తారని స్వీప్ పిడబ్ల్యుడి నోడల్ ఆఫీసర్గా జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మాజీ ఉంటారని, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్గా జిల్లా ఆడిట్ అధికారి జి రాకేష్ ఉంటారని,నోడల్ ఆఫీసర్ ఫర్ మీడియా,

కే రామచంద్ర రాజు, డి పి ఆర్ ఓ వ్యవహరిస్తారని, ఎలక్ట్రో రోల్ రోల్ నోడల్ ఆఫీసర్ గా జిల్లా అటవీ అధికారి రవి ప్రసాద్, ఓటర్ హెల్ప్ లైన్ 1950 నోడల్ ఆఫీసర్గా జిల్లా వ్యవసాయ అధికారిఎం గోవింద్ ఉంటారని, అబ్జర్వర్ నోడల్ ఆఫీసర్గా జిల్లా పౌరసరఫరాల అధికారి సిహెచ్ బ్రహ్మారావు, పోలింగ్ వెల్ఫేర్ నోడల్ ఆఫీసర్ గా జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య

పోలింగ్ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పన నోడల్ ఆఫీసర్ గా సర్దార్ సింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి విధులు నిర్వహిస్తారని అన్నారు. వీరందరూ ఎన్నికల ప్రవర్తన నియమాల్ని ఆచరిస్తూ పగడ్బందీగా నిర్వహించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ మహేందర్ ఏ ఆర్ ఓ లు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్ టీమ్, అకౌంటింగ్ టీమ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ధర్నాకు కౌన్సిలర్ల దూరం

**క్రాంతి కిరణ్ పై తగ్గాని అసంతృప్తి**
**జోగిపేటలో ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి**



అందోల్ మేజర్ న్యూస్ : జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత అరెస్టుకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న నిరసనకు అందోల్ నియోజకవర్గం కేంద్రమైన జోగిపేట పట్టణంలో నిర్వహించిన ధర్నాకు ఆందోల్ జోగిపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు దూరం ఉండడం విశేషం. శనివారం బి ఆర్ ఎస్ పార్టీ పిలుపుమేరకు నియోజకవర్గాలలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల ఒక్కరు హాజరు కాకపోవడం విశేషం అని చెప్పవచ్చు. గత రెండు సంవత్సరాలనుండి క్రాంతి కిరణ్ ఎమ్మెల్యేగా ఉన్నపటి నుంచి బి అర్ ఎస్ నాయకులు అయన పై అసంతృప్తి గా ఉన్న విషయం మనకు తెలిసిందే. ఏది ఏమైనా ఇంకా ఎమ్మెల్యే పై అసంతృప్తి కొనసాగించడంపై నాయకులు చర్చించుకోవడం కనిపించింది. ఇదిలా ఉండగా హనుమాన్ చౌరస్తాపై నిర్వహించిన ధర్నాలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

# గణేష్ గడ్డ శ్రీ సిద్ధి గణపతి హుండీ లెక్కింపు

**- హుండీ ఆదాయం రూ.15,41,514**
**- అన్నదానం హుండీ ఆదాయం రూ.80,814**



పటాన్ చెరు మేజర్ న్యూస్ : పటాన్ చెరు మండలం రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని గణేష్ గడ్డ నందు స్వయంభుగా వెలిసిన శ్రీ సిద్ధి గణపతి ఆలయంలో శనివారం హుండీ లెక్కింపును నిర్వహించారు. శ్రీ సిద్ధి గణపతి ఆలయానికి సంబంధించిన 68 రోజుల హుండీ ఆదాయం రూ.15,41,514 (పదిహేను లక్షల నాలబై ఒక్క వెయ్యి ఐదు పందల పద్నాలుగు రూపాయలు), అలాగే అన్నదానం హుండీ ఆదాయం రూ.80,814 (ఏనబై వేల ఏనిమిది వందల పద్నాలుగు రూపాయలు) వచ్చిందని ఆలయ ఈఓ పి.మోహన్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.శివరాజ్ సమక్షంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్ శర్మ, అజయ్ శర్మ, జగదీశ్ స్వామి, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో విజయవంతంగా ముగిసిన క్రీడా పోటీలు



పటాన్ చెరు మేజర్ న్యూస్ ; గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో 'గస్టో- 2024' పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిసినట్లు శనివారం వెల్లడించారు. విజేతలకు ప్రొఫెసర్ సి.త్రినాథరావు, ప్రొఫెసర్ ఎం.అక్కలక్ష్మి, డాక్టర్ వి.ఫణికుమారి, డాక్టర్ ఉమా సుస్మిత పెరెపా, డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి తదితరులు బంగారు పతకాలు, ట్రోఫీలను ఇచ్చి సత్కరించారు. వివిధ క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని వారు ఉద్ఘాటించారు. ముఖ్యమైన జీవిత పాఠమైన గెలుపు-ఓటమి



రెండింటినీ సునాయాసంగా అంగీకరించడం నేర్చుకుంటారని వారు అభిప్రాయపడ్డారు. వివిధ క్రీడా పోటీల విజేతలు, ద్వితీయ విజేతల వివరాలు... బ్యాడ్మింటన్ విజేత భవన్స్, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయం, బాస్కెట్బాల్ (పురుషుల) విజేత సీఎస్ఆర్ సీజేఐఈటీ, రన్నరప్ గీతం, బాస్కెట్బాల్ (మహిళలు) విజేత విల్లా మేరీ, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయం, క్రికెట్ విజేత ఎంవీఎస్ఆర్, రన్నరప్ గురునానక్ ఇన్స్టిట్యూట్, ఫుట్బాల్ (పురుషులు) విజేత మహీంద్రా విశ్వవిద్యాలయం, రన్నరప్ గీతం, ఫుట్బాల్ (మహిళలు) విజేత గీతం, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయం, కబడ్డీ (పురుషులు) విజేత గీతం, రన్నరప్ ఏఎస్ఆర్ ఏజేఐఈటీ, కబడ్డీ (మహిళలు) విజేత గీతం, రన్నరప్ సిఎస్ఆర్ విజేఐఈటీ, టేబుల్ టెన్నిస్ (పురుషులు-సింగిల్స్) విజేత మెథడిస్ట్ కళాశాల విద్యార్థి త్రిశూల్, రన్నరప్ గీతం విద్యార్థి ప్రణీత్, టేబుల్ టెన్నిస్ (పురుషులు- డబుల్స్) విజేతలు విట్-ఏపీకి చెందిన సందీప్-అభిషేక్, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన నీవర్ రోహిత్, టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్) విజేత కేవీఎస్ఆర్యా హెచ్ఎస్ కు చెందిన ఇక్షిత, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన ఆయుషి, త్రోబాల్ విజేత ఏఎస్ఆర్ వీజేఐఈటీ, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయం, వాలీబాల్ విజేత నిజాం కళాశాల, రన్నరప్ నిట్-ఏపీ. తొలుత, న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పెరేడ్లో ఎన్సీసీ తరఫున సాంస్కృత ప్రదర్శన చేసిన బీసీ విద్యార్థిని భావరాజు నందినిని అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ మేనేజర్ తపస్వి సమన్వయం చేయగా, క్రికెట్ టీమ్ కెప్టెన్ యశ్వంత్ రెడ్డి వందన సమర్పణతో ముగిసింది.

# నిరుపేదల ఆస్తుల ధ్వంసం సరికాదు

## పదేళ్ల పాలనలో ఏనాడు పక్షపాతానికి తావివ్వలేదు

## ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జిన్నారం మేజర్ న్యూస్:ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేయాలే తప్ప.. తమ పార్టీలో చేరికల కోసం అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసాలతో ఒత్తిళ్లకు గురి చేయడం కాంగ్రెస్ పార్టీకి చెల్లిందని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా మారుతున్నాయని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.జిన్నారం మండలం మాదారం గ్రామంలో రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల భవనాలను అక్రమంగా నిర్మించారంటూ కూల్చివేసిన సందర్భంగా.. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గ్రామంలో పర్యటించి బాధితులను పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధైర్య పడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, వ్యక్తిగతంగా ఆర్థిక సాయం అందజేస్తానని వారికి ధైర్యం అందించారు. తాత ముత్తాతల నుండి వస్తున్న సొంత స్థలాల్లో జీవనాధారం కోసం దుకాణాల సముదాయాలు నిర్మించుకుంటే.. కక్షపూరితంగా అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులకు ఫిర్యాదులు చేసి అక్రమంగా కూల్చి వేయించడం సరికాదని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం అత్యంత సహజమని, అధికారులు ఒత్తిళ్లకు తలోగ్గకుండా నిష్పక్షపాతంగా పనిచేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు ముగియకముందే కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలను అణిచివేయాలని చూడడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను అక్రమ కేసులు, ఒత్తిళ్లతో తమ పార్టీలో చేర్చుకోవాలని చూడడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శించారు. పోరాటాల చరిత్ర కలిగిన టిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కేసులు, జైళ్లు కొత్త కాదని, కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ప్రజాక్షేత్రంలోనే ఎదుర్కొంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు రాజేష్, మండల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓట్ల కోసమే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించిన బిజెపి

## – బోరంచ తల్లి ఎత్తిపోతల పథకానికి రూ:4.21 మంజూరి చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ

**– మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగంబర్ రావు**



రేగోడు సూర్య- మేజర్ న్యూస్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ లకు బిజెపి పార్టీ తెలంగాణ రాష్ట్రంలో మనుగడ కోల్పోతుందని భయపడిన బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో ఉనికి కాపాడుకోవడానికి ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించిందని శనివారం రేగోడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగంబర్ రావు, పిసిసి సభ్యులు మున్నూరు కిషన్, జడ్పీటిసి యాదగిరి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు చోటు మియా, పార్టీ శ్రేణులతో కలిసి బిజెపి పార్టీపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి10 నుండి14 పార్లమెంట్ సీట్లు గెలవబోతున్నాయని అన్ని సర్వేలు పార్టీకి అనుకూలంగా చెబుతున్నాయని బిజెపి ప్రభుత్వం రాష్ట్రంలో మనుగడ కోల్పోతామని భయపడి రాష్ట్ర అధ్యక్షులుగా బండి సంజయ్ ఉన్నప్పటినుండి ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేస్తామని చెప్పుకుంటూ వచ్చి ఎన్నికల్లో ఎలాగైనా మనుగడ కాపాడుకోవాలని పథకం ప్రకారమే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించడం జరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో అన్ని సీట్లు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి, బిఆర్ఎస్ రెండూ ఒకటేనని ఎన్నికల ముందు ఈ రెండు పార్టీలు నాటకమాడుతున్నాయని ఎద్దేవా చేశారు. బోరంచ తల్లి ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించి4.21 కోట్లను జీవో నెంబర్ 65 ద్వారా మంజూరు చేయించిన ఘనత వైద్య ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కె దక్కుతుందని మంత్రికి ప్రజల తరఫున పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పైప్ లైన్ ద్వారా వ్యవసాయ క్షేత్రాలకు, చెరువులకు సాగునీరు అందించడం జరుగుతుందని ఈ నీటి సరఫరాతో మన ప్రాంతం సస్య శ్యామలమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ శ్యామ్ రావు కులకర్ణి ,ఎంపిటిసి నాగిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు శంకరప్ప, తుల్జా రామ్ గౌడ్, పిఎసిఎస్ డైరెక్టర్ శివాజీ రావు, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు పిర్యా నాయక్, సంగి లింగం తదితరులు పాల్గొన్నారు.

# కోరంపల్లిలో పది లక్షల వరకు ప్రారంభించిన మల్లారెడ్డి



టేక్మాల్ సూర్య మేజర్ న్యూస్. కోరంపల్లి గ్రామంలో కొత్తపల్లి ఆమ్లెట్ విలేజ్ లో 10 లక్షల వరకు ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లారెడ్డి గ్రామంలో ఉన్న సమస్యలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న డ్రైనేజ్ సమస్యలపై గ్రామానికి సంబంధించిన పది లక్షల వరకును ప్రారంభించిన మల్లారెడ్డి ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విట్టల్ రాజు మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ యాదయ్య కిష్టయ్య మధుసూదన్ వినీత్ కుమార్ లింగం సాయిబాబా వెంకటేశం హనుమంతు గ్రామానికి సంబంధించిన మాజీ వార్డ్ మెంబర్స్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చిన్నచెల్మెడలో పోషణ పక్వాడ ప్రోగ్రామ్



మునిపల్లి : పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా భాగంగా శనివారం నాడు మండలంలోని చిన్నచెల్మెడ అంగన్ వాడీ సెంటర్ లో అంగన్వాడీ టీచర్ మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని గర్భిణీ శ్రీమంతం, కిశోర బాలికలకు అన్నప్రసన్న తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం గర్భిణీలు, కిశోర బాలికలు, బాలింతలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసిడీఎస్ సూపర్ శైలజ మాట్లాడుతూ చిరుధాన్యాలలో క్యాల్షియం, ఐరన్, ఫైబర్ తదితర పోషకాలు ఉంటాయని వాటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.

# అభ్యాసం అనేది నిరంతర ప్రక్రియ

## అపజయాలే పునాదులుగా విద్యార్థులు విజయాలు సాధించాలి : సుబ్బారావు పావులూరి




నిజాంపేట్ మేజర్ న్యూస్ : అభ్యాసం అనేది నిరంతర ప్రక్రియ అని, అపజయాలే పునాదులుగా విద్యార్థులు విజయాలు సాధించాలి సుబ్బారావు పావులూరి పేర్కొన్నారు. శనివారం విఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంత్ టెక్నాలజీస్ సంస్థ వ్యవస్థాపక చైర్ పర్సన్ డాక్టర్ సుబ్బారావు పావులూరి, డి ఆర్ డి ఎల్ సంస్థ శాస్త్రవేత్త సంచాలకులు డాక్టర్ జి ఏ శ్రీనివాస మూర్తులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవ మేధస్సులో నిక్షిప్తమై ఉన్న జ్ఞానమే విద్య ద్వారా వెలికి వస్తుందని, చంద్రయాన్ 3 వంటి విజయాల ద్వారా భారతీయులు ఏదైనా సాధించగలరని లోకానికి చెప్పగలిగామని అభిప్రాయపడ్డారు. విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునే నైపుణ్యాలు విలువలు నేర్చుకోవాలని సూచించారు. కృత్రిమ మేధ వంటి అధునాతన సాంకేతిక ఎంత విస్తరించినా మౌలికంగా ఇంజనీరింగ్ రంగంలో అభివృద్ధి వల్లనే ఎటువంటి సాంకేతికత రాణించగలుగుతుందని గుర్తు చేశారు. విదేశాలలో విద్య నేర్చుకున్న



కూడా తిరిగి భారతదేశానికి వచ్చి అభివృద్ధి చేయాలని విద్యార్థులకు వారు పిలుపునిచ్చారు. గత విద్యా సంవత్సరంలో అత్యున్నత ప్రతిభను కనబరిచి బంగారు పతకాలను సాధించిన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కళాశాలలో జరుగుతున్న సాంస్కృతికోత్సవం సెంటిలేషన్స్ 2కే24 లో భాగంగా గత రాత్ర కళాశాలలోని సంగీత కూటమి క్రషండో సభ్యుల కాక, గాయని గాయకులు హరిచరణ్, రమ్య





బెహరా, బ్యాండ్ ఎలిజియం దినకర్ కల్వల, కొంచెం హట్ కే చిత్ర బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జె ఎస్ రావు, ప్రధానాధ్యాపకులు డాక్టర్ సి డి నాయుడు, సంచాలకులు డాక్టర్ బి చెన్నకేశవరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ని దేశ్ కి నేత కాకుండా అడ్డుకోవడానికే ఎమ్మెల్సీ కవిత అరెస్టు కుట్ర





కుత్బుల్లాపూర్ మేజర్ న్యూస్ : కెసిఆర్ ని దేశ్ కి నేత కాకుండా అడ్డుకోవడానికే పన్నిన కుట్రలో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేసారని బిఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు పిలుపు మేరకు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద సూచనల మేరకు షాపూర్ నగర్ లోని ఉషోదయ టవర్స్ వద్ద నిర్వహించిన నిరసన ధర్నా కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రధానమంత్రి మోడీ, దర్యాప్తు సంస్థ ఈడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దర్యాప్తు సంస్థలను కీలుబొమ్మలుగా చేసుకొని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కక్ష సాధింపు చర్యలను, ఎమ్మెల్సీ కవితను అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రెండు జాతీయ పార్టీలు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ దేశ ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రాంతీయ పార్టీలను కూకటి వేళ్ళతో పెకిలించి ఆ పార్టీలను లేకుండా చేయాలనే కుటిల ఆలోచనతో కవితను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే రోల్ మోడల్ గా తయారుచేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై దేశ ప్రజలు దేశ్ కి నేత కెసిఆర్ అనడం రెండు జాతీయ పార్టీలకు నచ్చడం లేదని అన్నారు. ఇటువంటి కక్ష సాధింపు చర్యలకు బిఆర్ఎస్ పార్టీ భయపడే ప్రసక్తే లేదని, ప్రధాని మోడీ కక్ష సాధింపు చర్యలను దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో దొంగ నాటకాలు ఆడుతున్న రెండు జాతీయ పార్టీలకు దేశ ప్రజలు సరైన బుద్ధి చెబుతారన్నారు. వెంటనే ఎమ్మెల్సీ కవితను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాని మోడీ అవలంబిస్తున్న నిరంకుశ పాలనను నిరసిస్తూ కుత్బుల్లాపూర్ బిఆర్ఎస్ మహిళా నాయకురాలు ప్రధాని మోడీ చిత్రపటానికి చెప్పుల దండ వేశారు. నిరసన తెలియజేస్తున్న బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి జీడిమెట్ల ఠాణాకు తరలించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

దుండిగల్ మేజర్ న్యూస్ : మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి శనివారం ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజుని శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఎంపీ అభ్యర్థి లక్ష్మారెడ్డికి అభినందనలు తెలియజేసారు. తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అత్యధిక మెజారిటీ అందించడానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి కూకట్పల్లి నియోజకవర్గం ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని కచ్చితంగా బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ కుటుంబ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 19వ తేదిన రవీంద్ర భారతిలో భారతీయ సంస్కృతి-అంతర్జాతీయ సాంస్కృతిక సంబర మహోత్సవ వేడుకలు-డా. శాంతి కృష్ణ



సిటీబ్యూరో,మేజర్‌న్యూస్ః శ్రీశాంతి క్రిష్ణ సేవా సమితి,తెలంగాణ రాష్ట్ర భాషా-సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో ఈనెల 19వ తేదిన సోమవారం ఉదయం రవీంద్ర భారతి మెయిన్ హాల్‌లో కవిన్ ఫ్రెండ్లీ ఫౌండేషన్ (యు.ఎస్.ఏ.),విశ్వ కర్మ ఫౌండేషన్ అండ్ సేవా ట్రస్ట్‌ల సహకారంతో "భారతీయ సంస్కృతి-అంతర్జాతీయ సాంస్కృతిక సంబర మహోత్సవాలు,వి.కె.ఎఫ్.ఎస్.టి. వారిచే పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం ప్రోత్సాహంకోసం ఈ మహోత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విశ్వ కళా విరాట్ ,ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత,సహస్ర మహోత్సవ సామ్రాట్ డా. శాంతి కృష్ణ ఆచార్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవ సంబరాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు సి.సి.ఎస్. విభాగం టీమ్ -5 ఏ.సి.పి. కె.ఎం. కిరణ్‌కుమార్ గార్కి ఆత్మీయ గౌరవ సన్మాన సత్కారం కార్యక్రమంకూడ ఉంటుందన్నారు. ఈ సంబరాల మహోత్సవాలకు భారీగా ఆత్మీయులు,కళాభిమానులు,శ్రేయోభిలాషులు, బంధు,మిత్రులందరు తప్పని సరిగ్గా పాల్గొని మహోత్సవాలను దిగ్విజయం చేయాలని డా. శాంతి కృష్ణ ఆచార్య కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ 9849262619,9390996446 అనే నెంబర్లను సంప్రదించాలని డా. శాంతి కృష్ణ ఆచార్య తెలిపారు.

## నాణ్యతలో రాజీ పడే ప్రసక్తే లేదు

## డిప్యూటీ మేయర్



నిజాంపేట్ మేజర్ న్యూస్ : అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు నాణ్యతలో పడే ప్రసక్తే లేదని, చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 7వ డివిజన్ రెడ్డీస్ ఎవెన్యూ 1ఈ, అక్వాఎతి అపార్ట్మెంట్స్ వద్ద రూ 15లక్షలు వ్యయంతో నూతనంగా ప్రారంభిస్తున్న సీసీ రోడ్డు పనులను డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్డు పనులను నాణ్యతతో, త్వరగా పూర్తి చేయాలనీ కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, నాయకులు దశరథ్, ఇంజనీర్ అరుణ్, కాంట్రాక్టర్ , స్థానిక వాసులు వారణాసి కిరణ్, శివ, జీవన్ రెడ్డి, రమేష్ రెడ్డి, నాగి రెడ్డి, సతీష్, గీత, రజిత, కిరణ్ మై, అనిల్, రాజేందర, రామకృష్ణ, సురేష్ సుధాకర్ రెడ్డి, విశ్వ, హరీష్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## భండారి లేఔట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్



నిజాంపేట్ మేజర్ న్యూస్ : నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ గ్రామంలో అతి పెద్ద కాలనీ అయిన భండారి లేఔట్ కాలనీ లోని రోడ్ నెంబర్ 3బి కమ్యూనిటీ హాల్ లో శనివారం భండారి లేఔట్ సంక్షేమ సంఘం, మనబ్ సేవా సర్వీస్ ఎన్జీవో ఇరువురి సహకారంతో యశోదా హాస్పిటల్స్ హైటెక్ సిటీ సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించటం జరిగింది. ఈ మెడికల్ క్యాంపులో కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ఆప్తమోలోజి, డెంటల్ పరీక్షలు నిర్వహించటం జరిగింది. సుమారుగా 300 కాలనీ మహిళలు పెద్దవారు పరీక్షలు చేపించుకున్నారు వాసన్ ఐ కేర్ ద్వారా కంటి పరీక్షలు వాసన్ ఐ కేర్ ద్వారా కంటి పరీక్షలు ప్రైమ్ రిహాబ్ సొల్యూషన్స్ ద్వారా చిన్నపిల్లలకు, పెద్దలకు హియరింగ్ స్క్రీనింగ్ నిర్వహించటం జరిగింది.

# ప్లీజ్... గ్రూప్-1 పరీక్షకు వయో పరిమితి 51 ఏళ్లకు పెంచాలి



- రాష్ట్రంలో గ్రూప్ - 1 పరీక్ష జరగక 13 ఏళ్లు దాటింది.
- తమిళనాడులో ఉద్యోగ వయోపరిమితి 53 ఏళ్లు ఉంది.
- కాంగ్రెస్ ను అధికారంలోకి తెచ్చింది నిరుద్యోగులు మాత్రమే.
- రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ నిరుద్యోగుల సమితి విజ్ఞప్తి

హిమాయత్నగర్, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం 2024 సంవత్సరంలో విడుదల చేసే అన్ని ఉద్యోగ నోటిఫికేషన్ లకు వయోపరిమితిని 46 ఏళ్ల నుంచి 51 పెంచాలని తెలంగాణ నిరుద్యోగుల సమితి సభ్యులు కె.శ్రీనివాస్ రెడ్డి, సీహెచ్.వెంకట్ నారాయణ, ఇ. మంజుల రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... గ్రూప్-1 పరీక్షతో పాటు ఇతర పోటీ పరీక్షల అర్హతకు ప్రస్తుతం ఉన్న వయో పరిమితి 46 నుంచి 51 ఏళ్లకు ఈ ఒక్కసారి పెంచి తమకు న్యాయం చేయాలన్నారు. 50 ఏళ్ళు నిండిన వాళ్ళు సుమారు 5 లక్షల మందికి పైగా ఉన్నారని, వయస్సు అయిపోతున్న దృూఎష్ట్యా సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. వయో పరిమితి పెంచాలని గతంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. త్వరలో 600 పోస్టులకు పైగా గ్రూప్-1 నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో తమకు అవకాశం కల్పించాలన్నారు. అలాగే గ్రూప్-2 రాసేందుకు కూడా అనుమతి ఇవ్వాలన్నారు. తమిళనాడులో జనరల్ కేటగిరిలో 53 ఏళ్ళు ఇచ్చారని వారు గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియమకాల కోసం రెండవ దశ తెలంగాణ ఉద్యమంలో తాము కీలకపాత్ర వహించమని తెలిపారు. 1 లక్ష ఉద్యోగాలు ఇస్తామని టిఆర్ఎస్ ప్రభుత్వం కాలయాపన చేసింది అన్నారు. గత కెసిఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్ లో ఆలస్యం, నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం చేసి తమ భవిష్యత్తుకు తీరని అన్యాయం చేశారని వాపోయారు. 2016లో 34 ఏళ్ళు ఉన్న వయసును 44 సం.కి పెంచినప్పటికీ కెసిఆర్ ప్రభుత్వం గ్రూప్-1 నోటిఫికేషన్ ఇవ్వలేదని అన్నారు. కనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించుకొని వయోపరిమితిని పెంచాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో మోసాల మోడీని ఇంటికి సాగనంపుదాం

**- భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 93వ వర్ధంతి ప్రచార హోర్డింగ్ ఆవిష్కరణ - ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి**

హైదరాబాద్ మేజర్ న్యూస్ (సిటీ ప్రతిరిది):భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో మోసాల మోడీని ఇంటికి సాగనంపుదామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర పిలువునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 91వ వర్ధంతి సందర్భంగా హిమాయత్ నగర్ లోని, సత్య నారాయణ రెడ్డి భవన్ ప్రధాన రోడ్డుపై ఏర్పాటు చేసిన ప్రచార హోర్డింగ్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్రమాట్లాడుతూ... భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాధ్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. దేశ ప్రధాని దేశ ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసారని, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. 75సంవత్సరాలు గడిచినా ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక వసతులు ఎందుకు కేటాయించలేకపోతున్నారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. దేశ అభివృఎద్ధి అంటే మతాల మధ్య చిచ్చుపెట్టడమేనా అని వారు మోడీని ప్రశ్నించారు. దేశ ప్రధాని ప్రభుత్వ రంగ సంస్థలను, దేశ వనరులను యథేచ్ఛగా కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని ఆరోపించారు.





అందుకే మోసాల మోడీని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇంటికి సాగనంపాలని వారు పిలువునిచ్చారు. ఈ సందర్భంలోనే భగత్ సింగ్ దేశానికి బ్రిటిష్ ముష్కరులతో పోరాడి స్వాతంత్ర్యం తీసుకువస్తే, మోడీ ప్రజలను మోసం చేయడంలో, ప్రజల మధ్య చీలికలు తేవడంలో సిద్ధహస్తుడయ్యాడని వారు ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్,నేతలు కళ్యాణ్, అరుణ్, సాహిత్, కిరణ్, మధు, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# గీతంలో విజయవంతంగా ముగిసిన క్రీడా పోటీలు



హైదరాబాద్,మేజర్ న్యూస్ ప్రతినిధి: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో 'గస్టో- 2024' పేరిట నిర్వహిస్తున్న మూడు రోజుల అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా పోటీలు విజయవంతంగా ముగిసినట్టు శనివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. విజేతలకు ప్రొఫెసర్ సి.త్రినాథరావు, ప్రొఫెసర్ ఎం. ఆక్కలక్ష్మి, డాక్టర్ ని. ఫణికుమారి, డాక్టర్ ఉమా సుస్మిత పెరెపో, డాక్టర్ ఎం.నారాయణరావు చౌదరి తదితరులు బంగారు పతకాలు, ట్రోఫీలను ఇచ్చి సత్కరించారు. వివిధ క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంపొందుతుందని వారు ఉద్ఘాటించారు.ముఖ్యమైన జీవిత పాఠమైన గెలువు-ఓటమి..రెండింటినీ సునాయాసంగా అంగీకరించడం నేర్చుకుంటారని వారు అభిప్రాయపడ్డారు.వివిధ క్రీడా పోటీల విజేతలు, ద్వితీయ విజేతల వివరాలు:బ్యాడ్మింటన్ విజేత భవన్స్, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయం:బాస్కెట్బాల్ (పురుషుల) విజేత సీఎన్ఆర్ నీజేఐఈటీ, రన్నరప్ గీతం: బాస్కెట్బాల్ (మహిళలు) విజేత విల్లా మేరీ, రన్నరస్ మహీంద్రా విశ్వవిద్యాలయం; క్రికెట్ విజేత ఎంవీఎస్ఆర్, రన్నరప్ గురునానక్ ఇన్స్టిట్యూట్; ఫుట్బాల్ (పురుషులు) విజేత మహీంద్రా విశ్వవిద్యాలయం, రన్నరప్ గీతం; ఫుట్బాల్ (మహిళలు) విజేత గీతం, రన్నరప్ సుహీంద్రా విశ్వవిద్యాలయం; కబడ్డీ (పురుషులు) విజేత గీతం, రన్నరప్ ఏఎస్ఆర్ ఏజేఐఈటీ; కబడ్డీ (మహిళలు) విజేత గీతం, రన్నరప్ సిఎన్ఆర్ విజేఐఈటీ; టేబుల్ టెన్నిస్ (పురుషులు-సింగిల్స్) విజేత మెథడిస్ట్ కళాశాల విద్యార్థి త్రిశూల్, రన్నరప్ గీతం విద్యార్థిటేబుల్ టెన్నిస్ (పురుషులు- డబుల్స్) విజేతలు విట్-ఏపీకి చెందిన సందీప్-అభిషేక్, రన్నరప్ మహీంద్రా.విశ్వవిద్యాలయానికి చెందిన సీవర్ -రోహిత్:టేబుల్ టెన్నిస్ (మహిళలు సింగిల్స్) విజేత కేఎస్ఆర్యూ హెచ్ఎస్కు చెందిన ఇక్షిత, రన్నరప్ మహీంద్రా విశ్వవిద్యాలయానికి చెందిన ఆయుషి;త్రోబాల్ విజేత ఏఎన్ఆర్ వీజేఐఈటీ, రన్నరప్ సుహీంద్రా విశ్వవిద్యాలయం; వాలీబాల్ విజేత నిజాం కళాశాల, రన్నరప్ నిట్-ఏపీ,తొలుత, న్యూఢిల్లీలో జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవ పెరేడ్లో ఎన్సీసీ తరఫున సాంస్కృఎతిక ప్రదర్శన చేసిన బీసీ విద్యార్థిని భావరాజు నందినిని అతిథులు సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని స్పోర్ట్స్ మేనేజర్ తపస్వి సమన్వయం చేయగా, క్రికెట్ టీమ్ కెప్టెన్ యశ్వంత్ రెడ్డి వందన సమర్పణతో ముగిసింది.

## తనకు పెన్నులపై ఉన్న మక్కువతో ఒక భారీ బాల్ పెన్ తయారు చేసిన తెలంగాణా వాసి



హైదరాబాద్, మేజర్ న్యూస్; నిజామాబాద్ కు చెందిన ఆచార్య మాకునూరి శ్రీనివాస తన అద్భుతమైన నైపుణ్యం, సృఎజనాత్మకతతో చరిత్రలో తనదంటూ ఒక చెరగని ముద్రను వేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన బాల్ పెన్ తయారు చేసి రికార్డులు బద్దలు కొట్టారు. 5.5 మీటర్ల ఎత్తుతో, 37.2 కిలోల బరువుండే ఈ ఊహాతీతమైన పెన్ కేవలం ఇంజినీరింగ్ ప్రజ్ఞ మాత్రమే కాదు. భారతీయ పురాణాల చిత్రాలు సొంపుగా చెక్కబడిన అత్యద్భుతమైన కాన్వాస్ కూడా. ఈ అసాధారణ కలం ఏలా తయారైందో తెలుసుకునేందుకు సోమవారం, మార్చి 18వ తారీఖున ప్రసారం కాబోతున్న 'ఓఎంజి! యే మేరా ఇండియా' కార్యక్రమం చూడండి, కేవలం హిస్టరీ టీవీ 18లో. ఒక కొత్త ఒరవడిని సృఎష్టిస్తూ తన పదో సీజన్కి చేరుకున్న ఈ ఫ్యాక్చువల్ ఎంటర్టైన్మెంట్ షో ప్రతి సోమవారం రాత్ర 8 గంటలకు ప్రసారమవుతుంది. తమ అసమానమైన ప్రతిభతో, వింత అభిరుచులతో, సమాజాన్ని ప్రభావితం చేస్తూ, సాంకేతిక అద్భుతాలను సృఎష్టిస్తున్న అబ్బురపరిచే, ఆహా అనిపించే వ్యక్తుల కథలను వీక్షకులకు అందిస్తూ తన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటోంది.శ్రీనివాస తయారు చేసిన పెన్, సాంప్రదాయ కళని, అధునాతన ఆవిష్కరణాలతో మేళవించాలనే ఆయన పట్టుదలకు చిహ్నం. అద్భుతమైన కథనాలు, సాంస్కృఎతిక ప్రాముఖ్యత ఉన్న భారతీయ పురాణాల చిత్రాలను ఈ పెన్పై చెక్కారు. ఆచార్య మాకునూరి శ్రీనివాస సాధించిన విజయం ప్రపంచం మొత్తం గుర్తించింది, ప్రశంసించింది. రోజువారీ వస్తువులలో కూడా ఎన్నో ఆవిష్కరణలు చేయవచ్చని చెప్పడానికి ఈ గుర్తింపు ఒక ఉదాహరణ. ప్రపంచంలోనే అత్యంత పెద్దదైన ఈ బాల్ పెన్, ప్రయోజనకరమైన కళాత్మకతకి, పురాణ కథావ్యాప్తికి మధ్య ఒక వారధి లాంటిది. ఆ పెన్ను చూసిన వారందరిపైనా అదొక చెరగని ముద్ర వేస్తుంది. ఈ భారీ పెన్ రాబోయే కొన్ని తరాల కోసం చెరిగి పోని భారత పురాణాలను ఎలా సృఎష్టించిందో తెలుసుకోవడానికి తప్పక చూ డండి.

**చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపు : మందకృష్ణ మాదిగ**



హైదరాబాద్, మేజర్ న్యూస్ బిజెపికి మద్దతుగా చేవెళ్ల పార్లమెంట్ సన్నాహక సదస్సులో పాల్గొన్నమందకృఎష్ణ మాదిగ, రావు గళ్ళ బాబు రంగారెడ్డి జిల్లా ఎంఎస్పీ ఇంచార్జ్ ఆధ్వర్యంలో చేవెళ్లలోని కేజీఆర్ ఫంక్షన్ హాల్లో ఈ సదస్సు నిర్వహించబడినది.ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మందకృఎష్ణ మాదిగ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి అయిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మా పూర్తి మద్దతు లభిస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి పార్టీ అభ్యర్థి అయిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలువునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో యువకులు,కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సారస్వత పరిషత్తు

## రాష్ట్ర స్థాయి గ్రంథ పురస్కారాలు

హిమాయత్ నగర్ , మేజర్ న్యూస్ :తెలంగాణ సారస్వత పరిషత్తు 2024 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రస్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలకు సూచనలు, గ్రంథాలు ఆహ్వానించింది. 2022, 2023 సంవత్సరాల్లో తొలిసారి ముద్రణ పొందిన పుస్తకాలను మూడుప్రతుల చొప్పున పంపాలి.పద్య/ గేయ కవిత్వం, వచన కవిత్వం, కథ, నవల, సాహిత్య విమర్శ, ఇతరాలు, యువ పురస్కారం అనే ఏడు విభాగాల్లో పురస్కారాలు అందజేయనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీకి గ్రంథాలు పంపేవారు జన్మతః తెలంగాణ వారై ఉండాలని, ఇతర ప్రాంతాల వారు అర్హులు కారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కవిత్వం 60 పుటలకు, మిగతా ప్రక్రియల్లో పుస్తకాలు 100 పుటలకు తక్కువ ఉండరాదు. రచయితలు తమ పుస్తకాలను మూడు ప్రతుల చొప్పున నేరుగా పంపవచ్చు.పాఠకులు ఎవరైనా తమకు నచ్చిన పుస్తకాన్ని పురస్కారానికి పరిశీలించవలసిందిగా సూచించివచ్చు. ఏప్రిల్ 25వ తేదీలోగా తెలంగాణ సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్డు,ఆబిడ్స్, హైదరాబాద్-1 చిరునామాకు పుస్తకాలను పంపాల్సి ఉంటుంది. . కి పుస్తకం వివరాలు ముఖ్యంగా పుస్తకం పేరు, రచయిత పేరు, ముద్రణ పొందిన సంవత్సరం, పుటల సంఖ్య పేర్కొంటూ పాఠకులు సూచనలు పంపవచ్చు. 20- 35 ఏళ్ల మధ్య వయసున్న వారు యువ పురస్కారం కోసం తమ రచనల్ని మూడేసి ప్రతుల చొప్పున పంపాలి. 9603727234 లో ఇతర వివరాలు తెలుసుకోవచ్చు.

సూర్య
ఆదివారం 17
మార్చ్ 2024

# ఎలక్షన్ కమిషన్ నిబంధనలను పాటించాలి

## : జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



సిద్ధిపేట ప్రతినిధి, మేజర్ న్యూస్ : భారత ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికలు 2024 షెడ్యూల్ ను ప్రకటించిన నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి ఎం. మనుచౌదరి జిల్లా అదనపు కలెక్టర్ , దుబ్బాక ఏఆర్ఓ గరిమ అగ్రవాల్ తో కలిసి కలెక్టర్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభా ఎన్నికల 2024 కు సంబంధించి ఈరోజు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా షెడ్యూల్ విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈసీఐ షెడ్యూల్ ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నాలుగవ పేజ్ లో ఏప్రిల్ 13న పోలింగ్ ,దేశవ్యాప్తంగా జూన్ 4న కౌంటింగ్ నిర్వహించబడుతుందని అన్నారు. జిల్లాలోని హుస్నాబాద్, సిద్ధిపేట, దుబ్బాక మరియు గజ్వేల్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో 9,61,361 మంది ఓటర్లు ఉన్నారని అన్నారు. ఎన్నారై ఓటర్స్ 27 సర్వీస్ ఓటర్లు 452 ఉన్నట్లు తెలిపారు. మెదక్ లోక్ సభ పరిధిలో జిల్లాలో దుబ్బాక, సిద్ధిపేట, గజ్వేల్ శాసనసభ నియోజకవర్గాల పరిధి ఉంటుందన్నారు. కరీంనగర్ లోక్ సభ పరిధిలో హుస్నాబాద్ నియోజకవర్గం ఉందన్నారు. భువనగిరి లోక్ సభ నియోజకవర్గ పరిధిలో జనగామ శాసనసభ పరిధిలోని 4 మండలాలు జిల్లాలో ఉన్నాయన్నారు. ఎలక్షన్ షెడ్యూల్ విడుదలైనందున ఆర్వోలు అందరూ ఈసీఐ గైడెన్స్ ప్రకారం పని చేయాలని సూచించారు. జిల్లాలో జిల్లా ఎన్నికల అధికారి పరిధిలో పనిచేయాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పిడబ్ల్యుడి, ఉమెన్, సీనియర్ సిటిజన్స్ ఎలక్షన్ కమిషన్ కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను ఎన్నికల్లో కూడా కల్పిస్తామన్నారు. ఈవీఎం రాండమైజేషన్, పోలింగ్ పర్సన్స్ రాండమైజేషన్ జిల్లా స్థాయిలో చేస్తామని, ఎన్నికల నోడల్ ఆఫీసర్స్ నియామకమై ట్రైనింగ్ కూడా ఇచ్చామని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ వెంటనే అమల్లోకి వచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో ఉండే ప్రభుత్వానికి సంబంధించిన ఎలాంటివి డిస్ప్లే లేకుండా 24 గంటల్లో తొలగిస్తామని చెప్పారు. పబ్లిక్ సంబంధించిన ప్రాపర్టీస్ లలో 48 గంటలు, ప్రైవేట్ సంబంధించిన ప్రాపర్టీస్లలో 78 గంటలలో తొలగించాలన్నారు. ఇంకా ప్రారంభంకాని ప్రభుత్వ పనులను ప్రారంభించరాదని, ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నిబంధనలను అందరూ పాటించాలన్నారు. ఎన్నికల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా డిజిటల్ యాప్స్ ను ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు సువిధ పోర్టల్ ద్వారా అనుమతులు పొందాలన్నారు. ఓటర్ హెల్ప్ లైన్ యాప్, సి విజిల్ యాప్, ట్రైనింగ్, ఈవియం మేనేజ్మెంట్, మ్యాన్ పవర్ తదితరానికి సంబంధించి ఆప్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికలను విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 626 లొకేషన్లు వాటిలో 562 నార్మల్ లొకేషన్ లు, 64 క్రిటికల్ లొకేషన్స్ ఉన్నాయన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఎన్నికల కోడ్ నిబంధనలు జరగకుండా పర్యవేక్షించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా పరిధిలో 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్, 13 ఎస్ఎస్ టి టీంలు, 26 ఎంసిసి టీమ్లు, 103 రూట్ లు, 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఈ టీం లన్ని వెంటనే ఫోర్స్ లోకి వస్తాయని పేర్కొన్నారు.

# 10వ తరగతి పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు

## -డి.అంజయ్య, మండల విద్యాధికారి.



సదాశివపేట సూర్య మేజర్ న్యూస్ : సదాశివపేట మండలంలో మార్చి 18 నుండి మార్చి 30 వరకు పదవ తరగతి పరీక్షలు పూర్తి అవుతాయని సదాశివపేట మండలంలో 7 పరీక్షా కేంద్రాలలో 1152 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారని మండల విద్యాధికారి డి.అంజయ్య తెలిపారు. 5 సదాశివపేట పట్టణంలో, 2 గ్రామీణ ప్రాంతాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందికంది పరీక్షా కేంద్రం, ఆత్మకూరు ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం. పట్టణంలో ప్రభుత్వ రవీంద్ర మోడల్ స్కూల్, సెయింట్ ఆన్స్, సెయింట్ ఆంథోనీ, సెయింట్ మేరీస్, ఆక్స్ ఫర్డ్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ప్రతి సెంటర్ కు ఒక చీఫ్ సూపరిండెంట్, ఒక డిపార్ట్ మెంటల్ అధికారి, 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ఉంటారన్నారు. 7 మంది సూపరిండెంట్లు,7గురు డిపార్మెంటు అధికారులు, 77 మంది ఇన్విజిలేటర్స్ పరీక్షలు నిర్వహిస్తారు. 18 ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 732, 12 ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 434 మంది విద్యార్థులు ఉన్నారు 560 మంది బాలురు,606 మంది బాలికలు ఉన్నారన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలలో 144 సెక్షన్ అమలు లో ఉంటుంది. మంచి నీటి సౌకర్యం, మరుగుదొడ్లు లైటింగ్ సౌకర్యాలు ఉన్నాయని, అన్ని పరీక్షా కేంద్రాలలో మండల విద్యాధికారి డి.అంజయ్య, మండల తహసిల్దార్ సరస్వతి, పరీక్షా కేంద్రాలను సందర్శించి అన్ని సౌకర్యాలు గురించి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి రాజేశ్వర్ సి.యస్ మరియు డి.ఓ లు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుభ్రం చేస్తున్న బొల్లారం పురపాలక సంఘం సఫాయి సిబ్బంది

జిన్నారం మేజర్ న్యూస్:బొల్లారం పురపాలక సంఘం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుండి పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నందున మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజా రాణి, మున్సిపల్ కమిషనర్ మంగతాయారు గార్ల ఆదేశాల మేరకు స్కూల్లోని తరగతి గదులలో, పాఠశాల పరిసర ప్రాంతాలలో శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ అధ్వర్యంలో శుభ్రపరచడం జరిగింది.ఈ కార్యక్రమంలో బొల్లారం పురపాలక సంఘం శానిటరీ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, సఫాయి సిబ్బంది, పాల్గొన్నారు.



# దౌల్తాబాద్‌లో పోషణ పక్వాడ ప్రోగ్రామ్



రాయికోడ్, సూర్య మేజర్ న్యూస్ పోషణ్ పక్వాడా వారోత్సవాల్లో భాగంగా భాగంగా శనివారం నాడు మండలంలోని దౌల్తాబాద్ అంగన్ వాడీ సెంటర్ లో ఇన్ చార్జీ అంగన్వాడీ టీచర్ బుజ్జమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని గర్భిణీ శ్రీమంతం, కిశోర బాలికలకు అన్నప్రసన్న తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం గర్భిణీలు, కిశోర బాలికలు, బాలింతలు తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఐసిడీఎస్ సూపర్ విజయ లక్ష్మి మాట్లాడుతూ చిరుధాన్యాలలో క్యాల్షియం, ఐరన్, ఫైబర్ తదితర పోషకాలు ఉంటాయని వాటి వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో అంగన్ వాడి ఆయా మనెమ్మ, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ అమ్మాయిల జోలికి వెళ్ళినా, ఎక్కడికైనా తీసుకెళ్లినా, సహకరించినా జైల్ కే ఎస్సై వెంకట్ రెడ్డి



రాయికోడ్, సూర్య మేజర్ న్యూస్ : మైనర్ అమ్మాయి ల జోలికి వెళితే జైలుకే అని ఎస్సై హెచ్చరించారు ఈ మధ్య యువత చిన్న పెద్ద తేడా లేకుండా మైనర్ అమ్మాయిల జోలికి వెళ్ళడం , మయ మాటలు చెప్పి వెంట పడటం తర్వాత తీసుకెళ్లడం చేస్తున్నారు,ఎవరైనా మైనర్ అమ్మాయి జోలికి వెళ్ళినా, ఎక్కడికన్నా తీసుకెళ్లినా, తీసుకెళ్లేందకు ఎవరైనా సహకరించినా పోక్సో చట్టం కింద జీవితాంతం జైల్ లో ఉండాలిసి పరిస్థితి వస్తుంది,యువత ఇలాంటి జోలికి వెళ్లి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని కోరుతున్నాం. కాలేజ్ కూడా అయిపోయి సెలవులు వచ్చినాయి తల్లి దండ్రులు మైనర్ పిల్లల పై ఒక కన్నేసి ఉంచాలి వాళ్లు ఏమి చేస్తున్నారు, ఫోన్స్ విషయం లో గానీ, ఛాటింగ్ విషయం లో గానీ గమనిస్తూ ఉండాలి లేకుంటే చెడు వ్యసనాలకు బానిస అయి పక్క దారి పట్టి భవిష్యత్ నాశనం చేసుకుంటారు జాగ్రత్త గా ఉండాలి అని ఎస్సై వెంకట్ రెడ్డి హెచ్చరించారు.

# మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తా నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



పెద్దశంకరంపేట మేజర్ న్యూస్ : మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీ, మాడ్వెట్పల్లి, కోళాపల్లి తదితర గ్రామాలలో సీసీ రోడ్లను ప్రారంభించడంతో పాటు పలు అభివృద్ధి పనులకు ఆయన శంకు స్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి నారాగౌడ్, ఆర్యన్ సంతోష్, సంగమేశ్వర్, సత్యనారాయణ, దేవేందర్, గంగారెడ్డి, పెరుమాళ్ గౌడ్ రఘుపతిరెడ్డి, భానుగౌడ్, గోవింద్రావు, పులబోయిన నర్సింలు రోమాల సాయిలు, సాయిరెడ్డి, జహంగీర్ తదితరులున్నారు.